

ప్రభుత్వ భూమి.. అడిగేదెవరు

కార్వేటినగరంలో రూ.లక్షలు విలువ జేసే ప్రభుత్వ భూమిని కూటమి నేతలు దర్జాగా ఆక్రమిస్తున్నారు. - 8లో



కలెక్టర్ అభినందన

మంగళంపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు వర్డల్‌బుక్ ఆఫ్ రికార్డు సాధించడంపై కలెక్టర్ అభినందించారు. - 8లో



వన మహోత్సవం

చిత్తూరు మండలం చెర్లోపల్లి గ్రామంలో ఎస్వీ అగ్రికల్చర్ విద్యార్థులు వన మహోత్సవాన్ని నిర్వహించారు. - 8లో

న్యూస్‌రీల్

సేవల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు 21వ ర్యాంకు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు, మాతా శిశు ఆరోగ్యం తదితర 11 అంశాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖకు రాష్ట్రంలో 21వ ర్యాంకు వచ్చిందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుధారాణి తెలిపారు. 11 అంశాల్లోనూ గ్రీన్ మార్క్‌లోనే ఉన్నామన్నారు. ఇందుకు గాను 76.6 మార్కులు వచ్చాయన్నారు. మరింతగా వైద్య సేవలను విస్తృతం చేసి జిల్లాకు మంచిపేరు తీసుకొస్తామని ఆమె పేర్కొన్నారు.

నెమళ్ల మృత్యుగీతం

– రైల్వే విద్యుత్ లైన్లకు తగిలి పడిపోతున్న వైనం



రైల్వే ట్రాక్‌పై విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన నెమలి

కుప్పం రూరల్ : కుప్పం మండలం, పెద్దబంగారునత్తం పరిసరాల్లో నెమళ్లు రాలిపోతున్నాయి. పెద్దబంగారునత్తం సమీపంలోని మార్వాడ సుబ్రమణ్యస్వామి ఆలయం వద్ద నెమళ్లు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. ఆహారం కోసం అక్కడి నుంచి రైల్వే ట్రాక్ దాటుకుని ఇటువైపు పొలాల్లోకి వస్తున్నాయి. బెంగళూరు – చెన్నై రైల్వే లైన్ దాటుకుని రావాల్సి ఉంది. ఈ క్రమంలో నెమళ్లు రైల్వే విద్యుత్ లైన్లకు తగిలి అక్కడికక్కడే మృత్యువాత పడుతున్నాయి. నిత్యం ఒకటి రెండు నెమళ్లు పడిపోయి దర్శనమిస్తున్నాయి. నిత్యం నెమళ్లు రైల్వే ట్రాక్‌పై పడి ఉండడాన్ని చూసి స్థానికుల మనసు కలిచి వేస్తోంది. అటవీశాఖ అధికారులు అయినా నెమళ్లు ఇటు వైపుకు రాకుండా చూడాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : చిత్తూరు నగరం కొంగారెడ్డిపల్లిలోని ఐసీడీఎస్ చిత్తూరు రూరల్ ప్రాజెక్టు పరిధిలోని మూడు అంగన్‌వాడీ పోస్టులకు భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ శ్యామ్‌సుగుణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. చిత్తూరు నగర పరిధిలోని జాన్సన్ గార్డెన్‌లో మినీ అంగన్‌వాడీ కార్యకర్త, లెనిన్ నగర్‌లో సహాయకురాలు, గుడిపాల మండలంలోని రామభద్రపురంలో సహాయకురాలు పోస్టు ఖాళీలున్నాయన్నారు. వీటిని భర్తీ చేసేందుకు ఈనెల 16 నుంచి దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని, 24వ తేదీ సాయంత్రంతో స్వీకరణ ముగుస్తుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను పూర్తి చేసి కొంగారెడ్డిపల్లి ప్రాంతంలోని చిత్తూరు ప్రాజెక్టు కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

వేరుశనగ విత్తన కేటాయింపు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాలోని వ్యవసాయశాఖ డివిజన్‌ల వారీగా వేరుశనగ విత్తన కేటాయింపు చేశారు. ఖరీఫ్ సీజన్ దృష్ట్యా జిల్లాకు 60 వేల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు కావాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు ప్రభుత్వం 25977.6 క్వింటాళ్ల కాయలను కేటాయించింది. అధికారులు వ్యవసాయశాఖ డివిజన్ వారీగా కేటాయింపు చేశారు. చిత్తూరు డివిజన్‌కు 8540.4, నగరికి 2421.0 క్వింటాళ్లు, పుంగనూరుకు 7941.0 క్వింటాళ్లు, పలమనేరుకు 7075.5 క్వింటాళ్ల మేర కేటాయించినట్లు వ్యవసాయశాఖ అధికారులు వెల్లడించారు. కాగా ఇంత వరకు వేరుశనగ విత్తన రాయితీ ధర నిర్ధారణ కాలేదని తెలుస్తోంది.

మెరుగైన వైద్య సేవలందించాలి



కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ హనుమంతరావు

కార్వేటినగరం : సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ హనుమంతరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కత్తెరపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి మాట్లాడుతూ.. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించి దీర్ఘకాలిక రోగులను గుర్తించి వారికి కావాల్సిన మందులను అందించాలని ఆదేశించారు. అలాగే కుష్ఠు, ఆస్తమా రోగులను ముందుస్తుగా గుర్తించి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా ఇమ్యునైజేషన్‌కు సంబంధించిన యూ–విన్ పోర్టల్‌ను ఓపెన్ చేసి పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వర్షాలకు ఉరుస్తుందని సిబ్బంది అధికారి దృష్టికి తీసుకెళ్లడంతో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో మరమ్మతులు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది, ఆశా వర్కర్లు పలువురు పాల్గొన్నారు.

ఉసురు తీస్తున్నారు!





జిల్లాలో స్కానింగ్ సెంటర్ వివరాలు

మొత్తం స్కానింగ్ సెంటర్లు	78
చిత్తూరు	37
పలమనేరు	22
కుప్పం	14
నగరి	05

అమ్మగా .. అక్కగా..చెల్లిగా..అర్ధాంగిగా.. అనేక పాత్రల్లో చెయ్యి పట్టి నడిపించే ఆడబిడ్డకు ఆపదొచ్చింది.. ఆడపిల్ల భారమను కొని కడుపులోనే మరణ శాసనం లిఖిస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడుతున్న కొందరు వైద్యులు , స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణ లోపంతో పసి మొగ్గలను కడుపులోనే చిదిమేస్తున్నారు. ఇందు కోసం రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి.. డబ్బులు ముట్టజెబితే జిల్లాలోని పలు స్కానింగ్ కేంద్రాల్లో సులువుగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసి పుట్టబోయేది.. ఆడ..మగ ప్రసవానికి ముందే వెల్లడిస్తుండడంతో సరిహద్దు రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున లింగ నిర్ధారణ పరీక్షలకు జిల్లాకు తరలివస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

- గుట్టు చప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలు
- ఆడబిడ్డ అయితే కడుపులోనే చిదిమేస్తున్న వైనం
- తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గర్భిణులు చిత్తూరుకు..
- తమిళనాడు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పలుమార్లు ఫిర్యాదులు
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు



స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేస్తున్న అధికారులు, (ఇన్‌సెట్) పట్టుబడిన స్కానింగ్ నిర్వాహకులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : పవిత్రమైన వైద్య వృత్తిలో ఉంటున్న కొందరు ప్రబుద్ధులు డబ్బుకు దాసోహమవుతున్నారు. కాసుల కక్కుర్తికి కడుపులోని ఆడబిడ్డలను కడతేరుస్తున్నారు. లింగ నిర్ధారణ నేరమని చెప్పాల్సిన వైద్యులే ముఠాలుగా ఏర్పడి అక్రమ దందాకు పాల్పడుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో గుట్టుచప్పుడు కాకుండా లింగ నిర్ధారణ పరీక్షలకు ఒడిగడుతున్నారు. పుట్టబోయేది ఆడపిల్ల అని తెలిస్తే చాలు.. కడుపులోనే చిదిమేస్తున్నారు.

జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు గుట్టుగా చేస్తున్నారు. కాసులకు కక్కుర్తిపడి పలు స్కానింగ్ సెంటర్లు, ఆస్పత్రి నిర్వాహకులు, వారి సహాయకులు కడుపులో పెరుగుతోంది ఆడబిడ్డా, మగబిడ్డా అనేది ప్రసవానికి ముందే నిర్ధారిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో బాలురతో పోలిస్తే బాలికల సంఖ్య తక్కువగా నమోదవుతోంది. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం, కడుపులో ఉన్నది ఆడపిల్ల అని తేలితే వెంటనే అబార్షన్లు చేయించడంతో బాలికల సంఖ్య క్రమేణా తక్కువగా ఉంటోందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. కాగా ఈ ఏడాది కాలంలో 28,584 మంది జన్మిస్తే 15,212 మంది మగ పిల్లలు, 13,372 మంది ఆడ పిల్లలు జన్మించారు.

అవసరాలే ఆసరాగా..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్ట విరుద్ధమని బోర్డులు ప్రదర్శిస్తున్నప్పటికీ ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. పలువురు ఆర్ఎంపీ, పీఎంపీ గ్రామీణ వైద్యులు, ఆశా కార్యకర్తలు, కొంత మంది వ్యక్తులను నియమించుకొని పలువురు లింగ నిర్ధారణ పరీక్షలు యథేచ్ఛగా చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దంపతుల అవసరాలను ఆసరాగా చేసుకొని దాదాపు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు పరీక్షల కోసం డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా తొలి కాన్పులో ఆడపిల్ల పుట్టి రెండు, మూడోసారి గర్భందాల్చిన మహిళలు లింగ నిర్ధారణకు అధికంగా వస్తున్నారు.

సరిహద్దు ప్రాంతాలు చిత్తూరు వైపు...

జిల్లాలో స్కానింగ్ సెంటర్లు నడుపుతున్న కొందరు తల్లి గర్భంలోనే మరణ శాసనం లిఖిస్తున్నారు. ప్రధానంగా చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పం తదితర ప్రాంతాల్లోని స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు ఆర్ఎంపీలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే వైద్యుల సహాయకులు స్కానింగ్ కేంద్రాలకు తీసుకెళ్లి పుట్టబోయే బిడ్డ లింగ నిర్ధారణ వివరాలు వెల్లడిస్తున్నారు. ఈ విషయం ఆ నోటా ఈ నోటా పడి పక్క రాష్ట్రానికి కూడా పాకింది. తమిళనాడు, కర్ణాటక నుంచి వందల సంఖ్యలో గర్భిణులు లింగ నిర్ధారణ కోసం జిల్లాలోని స్కానింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఆడ అయితే శుక్రవారం, అమ్మవారి పేర్లు, అమ్మవారి చిత్రపటాలు చూపించడం, డాక్టరమ్మ, మైనస్, వంటి పదాలతో సూచిస్తున్నారు. మగబిడ్డ అయితే సోమవారం, ప్లస్, దేవుడి బొమ్మలు చూపి లింగ నిర్ధారణ విషయాలను బయటపెడుతున్నారు.

ఇష్టారీతిగా అబార్షన్లు

జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో దావాఖానల నిర్వాహకులు ఇష్టారీతిగా అబార్షన్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వివాహేతర సంబంధాల వల్ల గర్భందాల్చిన మహిళలు, ఇతర కారణాలతో మరికొందరు అబార్షన్లకు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. గర్భిణులు ఆరోగ్య పరంగా తప్పనిసరి పరిస్థితుల్లో అబార్షన్లు చేయించుకుంటే వైద్యాధికారులు, సిబ్బందికి సమాచారం ఇవ్వాల్సి ఉండగా, నిబంధనలను పట్టించుకోవడం లేదు. దీనిపై అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ఆస్పత్రి వివరాలు ఇలా..

జిల్లా ఆస్పత్రి	01
ఏరియా ఆస్పత్రులు	04
సీహెచ్‌సీలు	08
పీహెచ్‌సీలు	50
అర్బన్ హెల్త్ సెంటర్లు	15
ప్రైవేటు ఆస్పత్రులు	1,500
ఆర్ఎంపీలు	2,000

జిల్లాలో జననాల సంఖ్య

సంవత్సరం	మగపిల్లలు	ఆడపిల్లలు
2021-22	15,703	14,182
2022-23	15,061	14,186
2023-24	15,212	13,372

నిబంధనలు ఇవీ..

కడుపులో పెరుగుతున్న బిడ్డకు జన్యుపరమైన లోపాల కోసం, శిశువు పెరుగుదల ఎలా ఉందో తెలుసుకునేందుకు మాత్రమే పరీక్షలు నిర్వహించాలి. కడుపులోని బిడ్డ ఆడ, మగ ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించకూడదు. లింగ నిర్ధారణకు సహకరించిన వారికి 3 నెలల జైలు, రూ.10 వేల జరిమానా విధిస్తారు. రెండోసారి ఇదే తప్పు చేసిన వారికి అయిదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.50 వేల జరిమానా విధించే అవకాశం ఉంది. వైద్యులు దోషులుగా తేలితే లైసెన్సును మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు సిఫార్సు చేసి అనుమతి రద్దు చేసే అవకాశం ఉంది. గర్భంలోని శిశువుకు లింగ నిర్ధారణ చేయమని కోరినా మూడేళ్ల జైలు శిక్ష, రూ.50 వేల జరిమానా విధిస్తారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టాల్సిన అవసరం ఉంది. కాగా ఈ అక్రమ లింగ నిర్ధారణపై సాక్షిలో పలుమార్లు కథనాలు ప్రచురితమయ్యాయి. చిత్తూరు నగరంలో అక్రమంగా నిర్వహిస్తున్న ఓ లింగ నిర్ధారణ కేంద్రాన్ని కలెక్టర్ సుమిత్‌కుమార్ బుధవారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని గుట్టును రట్టు చేశారు.

లింగ నిర్ధారణ చేస్తే చర్యలు : కలెక్టర్



చిత్తూరు రూరల్ (కాణిపాకం) : గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని అటువంటి పరీక్షలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. బుధవారం చిత్తూరు నగరం లోని 9వ వార్డు భరత్ నగర్ కాలనీ నందు ఒక ప్రైవేటు ఇంట్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి వచ్చిన వారిని డెకాయిట్ ఆపరేషన్‌లో భాగంగా గుర్తించారు. జిల్లా కలెక్టర్ స్వయంగా వెళ్లి గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేసుకునేందుకు వచ్చిన 9 మందిని గుర్తించారు. ఈ ఆపరేషన్‌లో గర్భస్థ లింగ నిర్ధారణ చేసే సంబంధిత పరికరాలను, ఇంటిని సీజ్ చేసి కేసు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షల నిర్వహించడం చట్టరీత్యా నేరమని తెలిసినా కూడా ఇలా చట్ట వ్యతిరేక కార్యక్రమాల నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



గాయపడిన జగ్జీవన్‌రెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

- కార్యకర్తలు, నేతలతో ఆత్మీయ పలకరింపు
- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చౌడేపల్లె : వైఎస్సార్‌సీపీ, మమ్మలను నమ్ముకొన్న కార్యకర్తలు, నాయకులు, ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటాం..ఎవరూ అధైర్యపడకండి అంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం చౌడేపల్లె మండల పర్యటనలో భాగంగా రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకొంటున్న పార్టీ కార్యకర్త బయ్యప్పల్లెకు చెందిన జగ్జీవన్‌రెడ్డిను పెద్దిరెడ్డి పరామర్శించారు. అనంతరం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీ కోసం సైనికుల్లా పనిచేస్తున్న కార్యకర్తలు, నేతలకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పడిన కష్ట నష్టాలు తెలుసని రాబోయే రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట చిత్తూరు మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు దామోదరరాజు, వైస్ ఎంపీపీలు నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు నాగభూషణరెడ్డి, బోయకొండ మాజీ చైర్మన్ మిద్దింటి శంకర్ నారాయణ, మాజీ సింగిల్ విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి తదితరులున్నారు.

కొనసాగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు



సదుం కళాశాలను తనిఖీ చేసిన డీఐఈఓ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని 35 పరీక్ష కేంద్రాల్లో మూడో రోజు ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్లు డీఐఈఓ డా. ఆదూరు శ్రీనివాసులు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉదయం నిర్వహించిన జనరల్ ఇంటర్మీడియట్ పరీక్షల్లో 7568 మందికి గాను 7252 మంది విద్యార్థులు హాజరు కాగా 315 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. ఒకేషనల్‌లో 348 మందికి 320 మంది హాజరు కాగా 28 మంది గైర్హాజరైనట్లు వివరించారు. మధ్యాహ్నం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం జనరల్ పరీక్షలో 1556 మందికి 1468 మంది విద్యార్థులు హాజరు కాగా 88 మంది పరీక్షకు హాజరు కాలేదన్నారు. ఒకేషనల్‌లో 119 మందికి 108 మంది హాజరయ్యారన్నారు. జిల్లాలోని సదుం, సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సందర్శించినట్లు ఆయన తెలిపారు. జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు దయానందరాజు, బాల సుబ్రహ్మణ్యం, శరత్‌చంద్ర శేఖర్‌లు 11 కేంద్రాలను, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు 16 కేంద్రాలను తనిఖీలు చేశారన్నారు.

కూటమి ప్రభుత్వంలో దళితులకు అన్యాయం



నారాయణస్వామి, మాజీ ఉప ముఖ్యమంత్రి

కార్వేటినగరం : కూటమి ప్రభుత్వంలో దళితులకు న్యాయం కరువైందని మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి పేర్కొన్నారు. బుధవారం తమ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన ప్రతిసారి దళితులను అణగదొక్కడమే లక్ష్యంగా వ్యవహరిస్తారని ఆరోపించారు. చంద్రబాబు గత చరిత్ర చూస్తే చుండూరు, కారంచేడు ఘటనలు మరవక ముందే ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ఒక దళిత గ్రామాన్నే వెలివేయడం దారుణం అన్నారు. ఇంత జరుగుతున్నా అగ్ర కులస్తులపై కూటమి ప్రభుత్వం ఎందుకు కేసులు నమోదు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. ఇటీవల శ్రీరంగరాజపురం మండలం పుల్లూరు దళితవాడ ప్రజలు టీడీపీకి ఓటు వేయలేదనే కారణంతో దళిత గ్రామంలో అగ్రవర్ణ కులస్తులు విరుచుకుపడి ఇళ్లను, ఇంట్లోని విలువైన వస్తువులను ధ్వంసం చేయడమే కాకుండా.. దళితులకు ఏసీలు, కూలర్లు, ఫ్రిజ్‌లు అవసరమా అంటూ దుర్భాషలాడుతూ ధ్వంసం చేశారన్నారు. ఇంత జరిగినా కూటమి ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆరోపించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే అడుగడుగునా దళితులకు అవమానం తప్పడం లేదని ఆరోపించారు. దళితులు ఆర్థికంగా, రాజకీయంగా అధికారకంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఒక్క వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమని ఆయన తెలిపారు.

పాలిసెట్‌లో 95.02 శాతం ఉత్తీర్ణత

చిత్తూరు కలెక్టరేట్ : స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, ట్రెనింగ్ నిర్వహించిన పాలిసెట్ ప్రవేశ పరీక్షలో చిత్తూరు జిల్లా విద్యార్థులు 95.02 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ మేరకు పరీక్ష ఫలితాలను బుధవారం విడుదల చేశారు. జిల్లాలో పాలిసెట్ పరీక్షకు 1808 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో 1718 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాల్లో జిల్లా 95.02 శాతం ఉత్తీర్ణతను సాధించి రాష్ట్రంలో 20 స్థానంలో నిలిచింది. పాలిసెట్ పరీక్షలకు జిల్లాలో బాలురు 1022 మంది హాజరు కాగా 954 మంది ఉత్తీర్ణత చెందారు. బాలికలు 786 మందికి గాను 764 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 93.35 శాతం, బాలికలు 97.2 శాతం ఉత్తీర్ణతను సాధించారు.

జిల్లా టాప్ 3 ర్యాంకర్‌లు

పాలిసెట్ పరీక్షల్లో జిల్లాలో ముగ్గురు టాప్ 3 ర్యాంకుల్లో నిలిచారు. లక్ష్మీప్రశాంతి 117 మార్కులు సాధించి 267వ ర్యాంక్, సాయి ప్రసన్న 112 మార్కులు సాధించి 1017వ ర్యాంక్, మిథున్ కృతిక్ 111 మార్కులు సాధించి 1310వ ర్యాంక్ కైవసం చేసుకుని జిల్లా స్థాయిలో టాప్–3 ర్యాంకర్‌లుగా నిలిచారు.

గంగమ్మ మెరిసె.. జనం మురిసె







చిత్తూరు నగరంలో బుధవారం గంగమ్మ నిమజ్జనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రెండో రోజు అమ్మవారికి విశేష పూజలు చేశారు. అశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు గజమాలలు, చీరలు, నైవేద్యం సమర్పించారు. అమ్మవారి మెడలోని నిమ్మకాయల కోసం పోటీ పడ్డారు. సాయంత్రం వంశపారంపర్య ధర్మకర్తలు ఆనవాయితీ ప్రకారం గ్రామ దేవతకు పూజలు చేసి చిత్తూరు నడివీధి గంగమ్మ జలాధి పూజలను ప్రారంభించారు. అనంతరం అమ్మవారి ఊరేగింపు కదిలింది. భక్తులు అమ్మవారిని కనులారా వీక్షించేందుకు భారీ ఎత్తున తరలివచ్చారు. అర్ధరాత్రి వరకు ఊరేగింపు సాగింది. చివరకు కట్టమంచి చెరువులో అమ్మవారిని నిమజ్జనం చేశారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన ఓంశక్తి భక్తుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. - చిత్తూరు రూరల్ (కాణిపాకం)

క్లుప్తంగా

సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ



భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ

శాంతిపురం : మండలంలోని కడపల్లి పంచాయతీ శివపురంలో నిర్మించిన సీఎం చంద్రబాబు నివాసాన్ని జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు బుధవారం పరిశీలించారు. ఈనెల 25న ఇక్కడ గృహ ప్రవేశం కోసం సీఎం వస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంతంలో ఎస్పీ పర్యటించారు. ఇంటిని, పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సీఎం పర్యటన రూట్ మ్యాప్, ట్రాఫిక్ మేనేజ్మెంట్, ఫైర్ సేఫ్టీ, అంబులెన్స్, పార్కింగ్ తదితర సౌకర్యాల ఏర్పాట్లను సమీక్షించారు. సీఎం పర్యటనకు భద్రతా ఏర్పాట్లపై స్థానిక పోలీసులు, ఇంటలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ పోలీసులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుప్పం డీఎస్పీ పార్థసారధి, రూరల్, అర్బన్ సీఐలు మల్లేష్ యాదవ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు 250 మెట్రిక్ టన్నుల దాణా

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లాకు 250 మెట్రిక్ టన్నుల పశువుల దాణా కేటాయింపు జరిగిందని, వారంలో రోజుల్లో పంపిణీ ప్రారంభిస్తామని జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ అరీఫ్ తెలిపారు. ఇందులో భాగంగా 31 మండలాల నుంచి కావాల్సిన రైతు వివరాలను సేకరిస్తున్నామన్నారు. దాణా పూర్తి ధర రూ.22 అయితే పాడి రైతుకు 50 శాతం రాయితీతో రూ. 11 అందిస్తామని పేర్కొన్నారు.

ఈనెల 17కు హుండీ లెక్కింపు

చిత్తూరు రూరల్(కాణిపాకం) : కాణిపాక శ్రీవర సిద్ధి వినాయకస్వామి దేవస్థాన హుండీ లెక్కింపు వాయిదా వేసినట్లు ఈఓ పెంచల కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం జరగాల్సిన ఈ లెక్కింపు ఈనెల 17వ తేదీకి వాయిదా వేశామన్నారు. భక్తులు, ఆలయ అధికారులు, సిబ్బంది ఈ విషయాన్ని గమనించాలని ఆయన పేర్కొన్నారు.

‘భూసారం’.. సుదూరం

- లక్ష్యానికి దూరంగా భూసార పరీక్షలు
- సా..గుతున్న మట్టి నమూనాల సేకరణ
- ఇప్పటి వరకు 55 శాతం మాత్రమే
- ఈనెల 30 వరకు గడువు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : సాగులో అధిక దిగుబడి సాధించేందుకు తగిన రసాయనాలను వినియోగించేందుకు, మట్టి స్వభావం ఆధారంగా పంటలు పండించేందుకు భూసార పరీక్షలు ఎంతో ముఖ్యం. నేల సారవంతంపై అవగాహన లేకుండానే రైతులు ఎరువులను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. దీంతో పెట్టుబడి వ్యయం పెరిగి, పోషకాలు తగిన రీతిలో అందక భూమి నిస్సారమైపోతోంది. భూసార పరీక్షలు చేయడానికి ఖరీఫ్ అనుకూలంగా ఉంటుంది. దీంతో ఏటా ఈ భూసార పరీక్షలను ఖరీఫ్ సమయంలో వ్యవసాయశాఖ అధికారులు లక్ష్యంగా చేసుకుంటారు. ఈ ఏడాది గడువు సమీపిస్తున్నా లక్ష్యం మాత్రం అంతంతే ఉంది.

జిల్లాలోని వ్యవసాయశాఖ అధికారులు ఖరీఫ్ సీజన్‌కు ముందే మట్టి పరీక్షలు చేయాలని నిర్ణయించారు. 2025–26 ఏడాదికి జిల్లాలో 27,946 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యం నిర్దేశించారు. రైతు భరోసా కేంద్రానికి 55 చొప్పున మట్టి నమూనాలను సేకరించాలని నిర్ణయించారు. ఏప్రిల్ 15వ తేదీ నుంచి మట్టి నమూనాలను సేకరణను ప్రారంభించారు. అయితే లక్ష్యానికి తగ్గట్టు క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించడం లేదు. కాగా ఇప్పటి వరకు 15,453 నమూనాలు మాత్రమే సేకరించారు.



మట్టి నమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

మట్టి సేకరణ ఇలా...

నేలను బట్టి అయిదెకరాల వరకు ఒక నమూనా సేకరించవచ్చు. నమూనాలు తీసే పొలంలో 10–20 చోట్ల మట్టిని సేకరించాలి. పారతో ‘వి’ ఆకారంలో 6–8 అంగుళాల గుంత తవ్వాలి. అందులోని మట్టిని గోనెసంచి/ పాలిథిన్ కవరు మీద వేసి బాగా కలపాలి. ఆ మట్టిని నాలుగు భాగాలుగా విభజించాలి. ఎదురెదురుగా ఉన్న భాగాలు తీసుకుని, మిగిలిన భాగాలు పడేయాలి. అర కిలో మట్టిని తీసుకుని పరీక్షలకు పంపాలి.

పోషకాలు అందించేందుకు..

భూసారం భద్రంగా ఉన్నప్పుడే మొక్క ఎదుగుదల ఉంటుంది. తద్వారా దిగుబడులు నాణ్యతగా ఉండాలంటే నేల ఆరోగ్యంగా ఉండాలి. భూమిలో ప్రధాన పోషకాలైన ఉదజని సూచిక, లవణ పరిమాణం, నత్రజని, భాస్వరం, పొటాష్ లభించే మార్పులను భూ సార పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. రసాయన ఎరువు ల వాడకం పెరిగిందని ఇప్పటికే రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రకటించింది. పంటల సాగుకు తగిన నిష్పత్తిలో పోషకాలు లేనప్పుడు భూసార పరీక్షల ఫలితాల మేరకు పోషకాలు అందించి దిగుబడులు పెంచుకోవచ్చు.

సిబ్బంది నిర్లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా 502 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. ఆర్బీకే పరిధిలో మట్టి నమూనాలు సేకరిస్తారు. ఖరీఫ్ సీజన్ జూన్ నుంచి ప్రారంభమవుతోంది. ఆలో పే మట్టి నమూనాలు సేకరించాలని సిబ్బందికి ఆదేశా లు జారీ చేశారు. యాప్, జీపీఎస్ ఆధారంగా నమూ నాలు సేకరించి, చిత్రాలను అప్‌లోడ్ చేయాలి. ఫలితాలను రైతు మొబైల్‌ఫోన్‌కు తెలుగులో సంక్షిప్త సందేశం పంపేలా ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు. భూసార పరీక్ష కార్డును రైతుకు అందజేస్తారు. అయితే ఈ విషయంలో చాలా మంది వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలు స్తోంది. నెల రోజుల కాలంలో లక్ష్యం మేరకు 55 శా తం మాత్రమే మట్టి నమూనాలు సేకరించారు. ఈనెల 30వ తేదీతో సేకరణకు గడువు ముగియనుండగా మరో 45 శాతం సేకరణ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈలోపు వేరుశనగ విత్తన కాయల పంపిణీ ప్రారంభమైతే మట్టి నమూనాల సేకరణ మూలకు చేరుతుందని పలువురు రైతులు విమర్శిస్తున్నారు.

లక్ష్యం పూర్తి చేస్తాం



జిల్లా వ్యాప్తంగా నెల రోజులుగా మట్టి నమూనాల సేకరణ కొనసాగుతోంది. ఈనెల 30 వ తేదీ గడువు ముగియనుంది. ఈలోపు వంద శాతం లక్ష్యం పూర్తయ్యేలా చూస్తాం. సిబ్బంది, అధికారులకు వంద శాతం పూర్తయ్యేలా చూడాలని ఆదేశాలు ఇచ్చాం. ఆర్బీకేల వారీగా నమూనాలను విభజించి లక్ష్యాలను నిర్దేశించాం. భూసార పరీక్షలు ద్వారా ఎంతో మేలు చేకూరనుంది. మట్టి నమూనాలు సేకరించడం ద్వారా ఫలితాల ఆధారంగా చేసుకుని ఎరువులు వాడితే మంచి దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంది. – మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖ అధికారి, చిత్తూరు

విద్యార్థులకు కలెక్టర్ అభినందన

చిత్తూరు కలెక్టరేట్ : వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించిన బంగారుపాళ్యం మండలం మంగళపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ అభినందించారు. బుధవారం కలెక్టరేట్‌లో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఒకే పాఠశాలకు చెందిన ఐదుగురు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ లో నమోదు కావడం గర్వకారణమన్నారు. ఆ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ఏ.లహరిపై విలువలను మొదటి 1000 దశాంశాలను నాలుగు నిమిషాల 55 సెకండ్లలోనూ.. పదో తరగతి చదువుతున్న కె. పునీత్ సాయి 1000 నుంచి 2000 దశాంశాలను ఏడు నిమిషాల 30 ఒక్క సెకండ్లలోనూ, హేమ 2001వ దశాంశము నుంచి మూడు వేల దశాంశాల వరకు 8 నిమిషాల 11 సెకండ్లలో, రేవతి 3000వ దశాంశము నుంచి 3600 దశాంశాల వరకు ఎనిమిది నిమిషాలలో చెప్పడం గొప్ప విషయమన్నారు. ఈ విద్యార్థుల ప్రతిభ ను గుర్తించి లండన్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేర్లు నమోదు కావడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు మెంటార్ గా వ్యవహరించిన గణిత ఉపాధ్యాయుడు అరుణ శివప్రసాద్‌ను అభినందిస్తూ రికార్డులలో పేరు నమోదు చేయడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజ్యలక్ష్మి, సంపంగి, భారతి, సంజీవి, పిల్లారప్ప, పాపుదేశి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు జయంతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమి.. అడిగేదెవరు!


– దర్జాగా కూటమి నేతల ఆక్రమణ



పచ్చని చెట్లను యంత్రాలతో తొలగింపు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇసుక, గ్రావెల్ తోపాటు ప్రభుత్వ భూములను యథేచ్ఛగా ఆక్రమణలు చేస్తూ దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కార్వేటినగరం మండల కేంద్రానికి కూతవేటు దూరంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 419/2లో రూ.లక్షలు విలువ జేసే ప్రభుత్వ భూమిని పార్టీ కార్యాలయ నిర్మాణం పేరుతో ఆక్రమణకు దిగారు. ఈ మేరకు కూటమి నాయకులు బుధవారం భూమి చదును చేసే పనులు చేపట్టారు. అయితే అదే సర్వే నంబర్ పక్కనే ఉన్న రైతులు పనులను అడ్డుకుని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో ఇదే భూమిలో ఉపాధి పథకం నిధులతో పారంఫాండ్ల పనులు చేపట్టారు. అయినప్పటికీ కూటమి నాయకులు పచ్చని చెట్లను యంత్రాలతో నేల కూల్చి ప్రభుత్వ భూములను దర్జాగా ఆక్రమిస్తున్నారు. అడిగిన వారిపై కేసులు పెట్టి వేధిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా సర్వే నంబర్ 419/2లో చెట్లను నరికి భూమిని చదును చేస్తున్నట్లు రైతులు సమాచారం ఇచ్చారని, వెంటనే పనులను నిలిపి వేయాలని ఆదేశించడం జరిగిందన్నారు. గురువారం ఆ ప్రాంతాన్ని పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నకిలీ ధ్రువపత్రాలు సమర్పించిన న్యాయవాది తొలగింపు


THE BAR COUNCIL OF THE STATE OF ANDHRA PRADESH

బార్ కౌన్సిల్ వేటు వేసిన ఉత్తర్వుల కాపీ

పలమనేరు : న్యాయ విద్యకు సంబంధించి నకిలీ ధ్రువపత్రాలను సమర్పించి బార్ కౌన్సిల్‌ను మోసం చేసి పలమనేరు కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న జి. సుబ్రమణ్యంను రాష్ట్ర బార్ కౌన్సిల్ నుంచి వెంటనే తొలగించినట్లు ఏపీ బార్ కౌన్సిల్ కార్యదర్శి పద్మలత బుధవారం ఆదేశాలను జారీ చేశారు. ఆ మేరకు ఉత్తర్వులు స్థానిక కోర్టుకు పంపారు. న్యాయవాదులుగా బార్ కౌన్సిల్‌లో అర్హత లేకున్నా తప్పుడు ధ్రువపత్రాలతో ఎల్ఎల్‌బీ పూర్తి చేసినట్లు నకిలీ పత్రాలను అందజేసినట్లు పరిశీలనలో తేలింది. రాష్ట్ర వ్యాప్తంగా 17 మంది అక్రమంగా పలు కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నట్టు గుర్తించిన బార్ కౌన్సిల్ తక్షణమే వీరిపై వేటు వేసింది. ఇందులో భాగంగా పలమనేరు కోర్టులో రిజిస్టర్ చేసుకున్న జి. సుబ్రమణ్యంపై వేటు పడింది. దీనిపై మరింత విచారణ చేపట్టి వీరికి ఏ కళాశాల నుంచి నకిలీ సర్టిఫికెట్లు అందాయి? ఎలా ఎన్‌రోల్ చేసుకున్నారో కూపీ లాగనున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం పలమనేరులో సంచలనం రేకెత్తించింది.

నేడే డీఎస్సీ దరఖాస్తుకు ఆఖరు గడువు

తిరుపతి సిటీ : టీచర్ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వ విడుదల చేసిన డీఎస్సీ–2025కు దరఖాస్తుల స్వీకరణ గురువారంతో ముగియనుంది. ఈనెల 30వ తేదీ నుంచి హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకును అవకాశం ఉంటుంది. జూన్ 6వ తేదీ నుంచి జూలై 6వ తేదీ వరకు డీఎస్సీ పరీక్షలు నిర్వహించనున్నారు.

శ్రీవారి దర్శనానికి 3 గంటలు



తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 74,477 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 28,294 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ. 2.84 కోట్ల ఆదాయం వచ్చింది. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 2 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి మాత్రమే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వస్తే క్యూలో అనుమతించమని స్పష్టం చేసింది.

గృహ నిర్మాణాల పురోగతిలో అలసత్వం వద్దు

- అర్హత ఉన్నవారికి ఇళ్ల పట్టాలు
- పలు శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : గృహ నిర్మాణాల పురోగతిలో అలసత్వం వీడాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణ ప్రక్రియలో ఆసక్తి ఉన్న లబ్ధిదారులను గుర్తించి నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో చేపడుతున్న గృహ నిర్మాణాల ప్రక్రియలో లబ్ధిదారులను క్షేత్రస్థాయిలో పరిశీలించి గుర్తించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ, రుణాల మంజూరుపై వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. గృహ నిర్మాణాలు ప్రారంభించి త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో మొత్తం 77,366 గృహాలు మంజూరు కాగా ఇందులో 50,539 గృహాలు పూర్తి అయినట్లు తెలిపారు. బిల్లుల మంజూరులో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదన్నారు. ఏవైనా ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ గోపాల్ నాయక్, ఈఈ, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

అర్హత ఉన్న లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు

జిల్లాలో అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి ఇళ్ల పట్టాలు కచ్చితంగా మంజూరు చేయాలని అడిషనల్ సీసీఎల్ఏ ప్రభాకర్‌రెడ్డి కలెక్టర్‌ను కోరారు. జిల్లా పరిధిలో ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నిర్వహిస్తున్న రీ సర్వే కసరత్తును ప్రత్యేకంగా పరిశీలిస్తున్నామన్నారు. రీ సర్వే ప్రక్రియలో ప్రతి ఫైల్‌ను జేసీ పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ భూములు, కోర్టు కేసులకు సంబంధించిన భూములు పరిశీలించి రీ సర్వే ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ మోహన్‌కుమార్, ఏఓ కులశేఖర్ పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీ, పాలిసెట్‌లో ‘విశ్వం’ జయకేతనం



ఏపీఆర్‌జేసీలో ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీఆర్‌జేసీ, పాలిసెట్ ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారని సంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఏపీఆర్‌జేసీలో వై.దేదీప్య రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు, కె.మునిరూపేష్ 7వ ర్యాంకు, జె.అంజలి 9వ ర్యాంకు, మనీషా 10వ ర్యాంకు సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే రేవంత్, అబ్దుల్ ఖాదర్, యోగి, సమత, భవ్యశ్రీ గీతిక, రోషన్, ట్వింకిల్, సంతోష్, భువన, కార్తికేయ తదితరులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. పాలిసెట్ ఫలితాల్లో ఎం.కావ్య 120మార్కులకు 117మార్కులు సాధించి బాలికల విభాగంలో జిల్లా స్థాయి ఉత్తమ ర్యాంకును సాధించినట్లు తెలిపారు. కిమ్యశ్రీ 116, కె.నిత్యశ్రీ 114, అబ్దుల్ ఖాదర్ 113, సుజినిరెడ్డి, చాతుర్య, రాజకుమారీ 112, ఎన్.రోషన్ 111, చేతన్‌రెడ్డి 110, జస్మిత 109మార్కులతో జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు వివరించారు. రాణించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ తులసీ విశ్వనాథరెడ్డి అభినందించారు.

వన మహోత్సవం



రోడ్లను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జాతీయ సేవా పథక కార్యక్రమంలో భాగంగా చిత్తూరు మండలం చెర్లోపల్లి గ్రామంలో బుధవారం ఎస్వీ అగ్రికల్చర్ విద్యార్థులు వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రం పరిసర ప్రాంతాల్లో మొక్కలను నాటారు. అలాగే పరిసరాల పరిశుభ్రతను చేపట్టారు. చీపురు పట్టి రోడ్లను శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వాడకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వాటి వల్ల కలిగే అనర్థాలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి శైలజ, ప్రశాంతి తదితరులున్నారు.

కాలువలో పడి వృద్ధుడి మృతి



శంకరప్ప మృతదేహం

బైరెడ్డిపల్లె : మండలంలోని కామినేపల్లె గ్రామానికి చెందిన శంకరప్ప (80) మురుగు నీటి కాలువలో పడి బుధవారం మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు ..కామినేపల్లె గ్రామానికి చెందిన శంకరప్పకు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో బైరెడ్డిపల్లె వద్ద వెళుతుండగా మెయిన్‌రోడ్డు సమీపంలోని మురుగు నీటి కాలువలో అదుపు తప్పి పడి మృతి చెందాడు. పంచాయతీ సిబ్బంది గమనించి మృతి చెందిన వృద్ధుడిని బయటకు తీశారు. చుట్టు పక్కల ప్రాంతాల వారు గుర్తించి కామినేపల్లె శంకరప్పగా నిర్ధారించారు. విషయం కుటుంబ సభ్యులకు తెలియజేసి మృతదేహాన్ని అప్పగించారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి



బలరాం (ఫైల్)

పుత్తూరు : మున్సిపాలిటీ 20వ వార్డు నెత్తం దళితవాడకు చెందిన జి.బలరాం(64) బుధవారం వడదెబ్బ తగిలి మృత్యువాత పడినట్లు గ్రామస్తులు తెలిపారు. బుధవారం ఒక్కసారిగా విరేచనాలు, వాంతులు కావడంతో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాహనాన్ని ఢీకొని కారు దగ్ధం



తవణంపల్లె : స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట బుధవారం స్పీడ్ బ్రేకర్ వద్ద ముందు వెళుతున్న వాహనాన్ని కారు ఢీకొంది. దీంతో కారులో హఠాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. మంటలను ఆర్పేందుకు స్థానికులు, పోలీసు సిబ్బంది ఎంత ప్రయత్నించినా ఫలించలేదు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలు ఇలా.. తిరుపతికి చెందిన తేజ, మరో వ్యక్తితో కలిసి టి.పుత్తూరులో గంగ జాతరకు విచ్చేశారు. ఉత్సవాలను ముగించుకొని తిరిగి ఇంటికి బయలుదేరారు. ఈ నేపథ్యంలో తవణంపల్లె పోలీస్ స్టేషన్ ఎదుట స్పీడు బ్రేకర్ వద్ద రెండు వాహనాలు మెల్లగా దాటుతుండగా వెనుక వైపు నుంచి వచ్చిన కారు ఐషర్ వాహనాన్ని ఢీకొంది. దీంతో కారులో ఉన్న ఇద్దరు బయటకు దిగేశారు. కొంత సేపటికే కారులో హఠాత్తుగా మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. దీనిపై తవణంపల్లె పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయలేదని వివరించారు.

వెటర్నరీ కళాశాలలో వీసీఐ బృందం



కళాశాల విభాగాలను పరిశీలిస్తున్న వీసీఐ బృందం

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ కళాశాలలో వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (వీసీఐ) బృందం బుధవారం పర్యటించింది. సుమారు 10విభాగాలను పరిశీలించింది. అధ్యాపకుల వివరాలు, తరగతి గదులు, పాఠ్యాంశాల బోధనపై వివరాలు సేకరించింది.

‘ష్యూర్ సక్సెస్’ నీట్ లాంగ్ టర్మ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అకాడమీ నిర్వాహకులు

తిరుపతి రూరల్ : తిరుపతి సమీపంలోని తాటితోపు వద్ద సుమిత్ర టవర్స్‌లో శ్రీ సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ వారు ప్రత్యేకంగా రూపొందించిన నీట్ ష్యూర్ సక్సెస్ ప్రోగ్రామ్‌ను బుధవారం ప్రకటించారు. ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించినట్లు కరెస్పాండెంట్ శేషారెడ్డి తెలిపారు. ఈ పోస్టర్లను విడుదల చేశారు. అభ్యాసం, విద్యార్థులకు మెరుగైన గుణాత్మక శిక్షణను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. 90 శాతం హాజరు ఉన్న విద్యార్థులకు నీట్–2026లో 500మార్కులకు తక్కువ వస్తే 50శాతం ఫీజు రీఫండ్ చేస్తామని స్పష్టం చేశారు. వివరాలకు అకాడమీ సెంటర్, లేదా 9133380222 నంబరులో సంప్రదించాలని సూచించారు.